నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
8 సోమవారం 12 మే 2025 MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




విద్యార్థులను అభినందిస్తున్న విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి

# ట్రినిటీ విద్యార్థుల విజయభేరి

కరీంనగర్ కమాన్ చౌరస్తా, మే 11 : ఎప్‌సెట్ ఫలితాల్లో ట్రినిటీ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు విద్యా సంస్థల వ్యవస్థాపక చైర్మన్ దాసరి మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లోని వావిలాలపల్లిలోగల కళాశాల ప్రాంగణంలో ఆయన విద్యార్థులను అభినందించి మాట్లాడారు. తమ విద్యా సంస్థల్లోని విద్యార్థులు 405, 430, 560, 697, 730, 760, 791, 859, 934,1104, 1166, 1546, 1619, 1795, 1950 ర్యాంకులతో పాటు మొత్తం 89 మందికి పైగా విద్యార్థులు 10 వేలలోపు ర్యాంకులు సాధించారని చెప్పారు. ట్రినిటీ జూనియర్ కళాశాలలు పోటీ పరీక్షల్లో ఏటా అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తూ విద్యా రంగంలో తమ ప్రత్యేకతను చాటుతున్నాయని తెలిపారు. ఐఐటీ జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్, ఎప్‌సెట్ పోటీ పరీక్షల బోధనలో అనుభవం, నైపుణ్యం కలిగిన అధ్యాపకుల శిక్షణ, అంకిత భావం కలిగి, నిరంతరం కృషి చేయడం ద్వారానే ఈ ర్యాంకులు సాధ్యమయ్యాయన్నారు. ఈ ఫలితాలు కేవలం కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన కళాశాలల్లోవి మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రినిటీ విద్యా సంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్ రెడ్డి విద్యార్థులను అభినందిస్తూ, ఈ విజయంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు.

క్లిక్..క్లిక్..



కాలినడక బిందెల్లో నీరు తీసుకెళ్తున్న ముల్కలమంద మహిళలు

# 'పానీ' పాట్లు..

- ముల్కలమంద, తోయరేట్ గ్రామాల్లో నీటి కటకట
- వ్యవసాయ బావే ఆధారం
- నిత్యం ప్రమాదపుటంచున నీరు తోడుకుంటున్న ప్రజలు

*తిర్యాణి మండలం ముల్కలమంద, తోయరేట్ గ్రామాల్లో సుమారు 50 కుటుంబాలుండగా, వీరంతా తాగు నీటికి తండ్లాడాల్సి వస్తున్నది. మిషన్ భగీరథ పథకం ఉన్నప్పటికీ పైపులైన్లు సరిగా లేక గుక్కెడు నీటికోసం వేట సాగించాల్సిన దుస్థితి నెలకొన్నది. ముల్కల మంద గ్రామానికి అర కిలోమీటర్ దూరంలోని వ్యవసాయ బావే వీరికి దిక్కు కాగా, నిత్యం అక్కడికి వెళ్లి బావి గోడపై నిలబడి ప్రమాదకర పరిస్థితుల్లో నీరు తోడుకోవాల్సి వస్తున్నది. ఏ మాత్రం పట్టుతప్పినా బావిలో పడిపోయే అవకాశమున్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఈ గ్రామాల్లోనే కాదు గుండాల, మంగి, తొక్కిగూడ, తాటిగూడ, గోపేర, లంబాడీతండా, గోవెన, కర్పుగూడ, కొలాంగూడ, బీంరాల్ల, బందర్‌గూడ, మొర్రిగూడ, లోహ, తోయరేటి, మంగర్‌మోడి, గోండర్‌గాం, బోర్డాం తదితర గ్రామాల్లోనూ గొంతు తడుపుకునేందుకు గిరిజనులు అష్టకష్టాలు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతులు చేయించి తాగు నీరు సరఫరా చేయాలని వారు వేడుకుంటున్నారు.*

*- కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ)*



వ్యవసాయ బావిలో నుంచి ప్రమాదకరంగా నీటిని తోడుతున్న ప్రజలు





నాడు పచ్చగా ఆహ్లాదకరంగా ఉన్న కిష్టంపేట ప్రకృతి వనం





# కళ తప్పిన కిష్టంపేట ప్రకృతి వనం

సర్కారు పట్టింపులేని తనంతో అధ్వానం



ప్రకృతి వనంలో మందు బాబులు తాగి పడేసిన బాటిల్

*కేసీఆర్ సర్కారులో కళకళలాడిని కిష్టంపేట పల్లె ప్రకృతి వనం.. ప్రస్తుత ప్రభుత్వ పుణ్యమాని ఆనవాళ్లు కోల్పోయి అధ్వానంగా మారింది. బీఆర్‌ఎస్ హయాంలో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయడంతో పాటు చల్లని వాతావరణం కోసం మొక్కలు నాటించారు. చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేయడంతో పాటు కూర్చునేందుకు ప్లాట్‌ఫాంలు, మూడు రకాల జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. చిన్నారులు ఆడుకోవడానికి వసతులు కల్పించారు. ప్రతి రోజూ ఉదయం.. సాయంత్రం ఇక్కడ వాకింగ్ చేసేవారు. స్థానికులంతా ఇక్కడ సేద తీరేవారు. కానీ, ప్రభుత్వం మారడంతో ఈ పల్లె ప్రకృతి వనాన్ని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. చెట్లకు నీరు పట్టేవారు లేకపోవడంతో ఎండిపోతున్నాయి. నాడు ఆహ్లాదం పంచిన ఈ పార్క్ నేడు.. మందు బాబులకు అడ్డగా మారిందని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనానికి పూర్వ వైభవం తీసుకరావాలని వారు కోరుతున్నారు.*

*- చెన్నూర్ రూరల్, మే 11*



నేడు చెట్లు ఎండిపోయి కళావిహీనంగా మారిన కిష్టంపేట ప్రకృతి వనం



నిరుపయోగంగా విద్యుత్ మోటార్

# కేజీబీవీల అప్‌గ్రేడ్

- కొత్తగా ఐదు కస్తూర్బాల్లో ఇంటర్ విద్య
- ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు

కోటపల్లి, మే 11 : జిల్లాలో కొత్తగా ఐదు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను అప్‌గ్రేడ్ చేయగా, ఈ విద్యా సంవత్సరం నుంచే ఇంటర్ విద్య అమల్లోకి రానున్నది. జిల్లాలో మొత్తం 18 కేజీబీవీలు ఉండగా, గతంలో 10 చోట్ల ఇంటర్ విద్య ప్రారంభమైంది. మిగతా ఎనిమిది పాఠశాలల్లో ఇంటర్ విద్య ప్రారంభించాల్సి ఉండగా, ఈ విద్యా సంవత్సరం నుంచి కోటపల్లి, వేమనపల్లి, హాజీపూర్, కన్నెపల్లి, దండేపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సంబంధిత శాఖ చర్యలు చేపట్టింది. ఇక కాసిపేట, భీమిని, భీమారం మండలాల్లోని కేజీబీవీల్లో ఇంటర్ ప్రారంభించాల్సి ఉండగా, సౌకర్యాల లేమి కారణంగా అప్‌గ్రేడ్ చేయలేదు.

## ఒక్కో గ్రూప్‌లో 40 సీట్లు

కస్తూర్బాల్లో ఇంటర్ ప్రారంభం కానుండగా, ఒక్కో గ్రూప్‌లో 40 సీట్లు ఉండనున్నాయి. కానీ, ఆయాచోట్ల సరైన సౌకర్యాలు లేని కారణంగా ఒక్కోచోట ఒక్కో గ్రూప్‌లో మాత్రమే అడ్మిషన్లు తీసుకోనున్నారు. ఇంటర్ అప్‌గ్రేడ్ చేసిన కస్తూర్బాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే విద్యార్థినులకు మరింత ప్రయోజనం చేకూరనున్నది.

## బాలికల విద్యకు బాసట

కేజీబీవీల్లో ఇంటర్ విద్య ప్రారంభం కావడంతో బాలికా విద్యకు మరింత బాసట కలగనున్నది. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాయాలు ఇప్పటికే సత్ఫలితాలను సాధిస్తున్నాయి. నిరుపేద, నిరాశ్రయులైన బాలికలను అక్కున చేర్చుకొని మెరుగైన విద్యను అందిస్తూ ముందుకు సాగుతున్నాయి. కేజీబీవీల అప్‌గ్రేడ్‌తో విద్యార్థినులు పదో తరగతితో ఆగకుండా ఇంటర్‌ను కూడా అదే పాఠశాలలో పూర్తి చేసే అవకాశం కలిగింది.



కోటపల్లి కేజీబీవీ విద్యార్థులతో మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ (ఫైల్)

## సద్వినియోగం చేసుకోవాలి



కోటపల్లి కేజీబీవీలో ఈ విద్యాసంవత్సరం నుంచే ఇంటర్ తరగతులు ప్రారంభిస్తాం. కొత్తగా బైపీసీ గ్రూప్‌ను ప్రారంభించి విద్యార్థులకు పాఠాలు బోధించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. కేజీబీవీల్లో ఇంటర్ విద్య అమలు చేయడం వల్ల విద్యార్థినుల చదువు మధ్యలో ఆగిపోకుండా ఉంటుంది. కేజీబీవీల్లో నాణ్యమైన విద్య అందుతున్నది. విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి.

*- హరిత, కేజీబీవీ ఎస్‌వో, కోటపల్లి*

# కలెక్టర్ చెప్పినా నీళ్లిస్తలేరు

- ఆరెపల్లి మహిళల ఆవేదన
- ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ఆరెపల్లి మహిళలు

భీమారం, మే 11 : కలెక్టర్ చెప్పినా తాగు నీరిస్తలేరని ఆరెపల్లి గ్రామానికి చెందిన మహిళలు ఆదివారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఇటీవల మా ఊరికి కలెక్టర్ వస్తే తాగు నీటి సమస్య గురించి చెప్పామని, ఇందుకు ఆయన స్పందిస్తూ మిషన్ భగీరథ పైపులైన్‌ల మరమ్మతుల కోసం రూ. 1.10 లక్షలు మంజూరు చేస్తానని చెప్పారన్నారు. మూడు రోజుల్లో తాగు నీరు సరఫరా చేయాలని మా ఊరి కార్యదర్శిని ఆదేశించారని, ప్రస్తుతం వారం దాటినా తాగు నీరందడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.



రామకృష్ణాపూర్ : ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీ తీస్తున్న వివిధ పార్టీల నాయకులు

# వీర జవాన్లకు నివాళి

బెల్లంపల్లి, మే 11 : భారత్-పాకిస్తాన్ యుద్ధంలో అమరులైన మురళీనాయక్, ఇతర వీరజవాన్లకు బెల్లంపల్లి పట్టణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తిలక్‌స్టేడియం ఆవరణలో నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత్ ఆపరేషన్ సిందూర్‌తో పాక్ ఉగ్రవాదానికి గట్టి సమాధానం ఇచ్చిందన్నారు. భారత్ సైనిక పరాక్రమానికి ఆపరేషన్ సిందూర్ నిదర్శనమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పట్టణ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు వంగల చక్రపాణి, కార్యదర్శి దామెర విజయ్‌కుమార్, కార్యవర్గ సభ్యులు బాసబోయిన పోతరాజు, మాదరబోయిన రాజేందర్, మద్దెల శ్రీనివాస్, గరిగె రాజ్‌కుమార్, ముద్ర వెంకటి, మునిమంద సత్యం, తాడబోయిన రవి, చేతి కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.

## క్యాతపల్లిలో సంఘీభావ ర్యాలీ

రామకృష్ణాపూర్, మే 11: క్యాతనపల్లి మున్సిపాలిటీలో ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా, భారత జవాన్లకు సంఘీభావం తెలుపుతూ క్యాతనపల్లి యువత ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ తీశారు. స్థానిక శ్రీనివాస గార్డెన్ నుంచి ఎంఎన్‌ఆర్ గార్డెన్ వరకు జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. యువత సభ్యులు పొలం లవన్‌కుమార్, సాత్విక్, అజయ్, శివకుమార్, వివిధ పార్టీల నాయకులు పాల్గొని భారత్ మాతాకీ జై.. జై జవాన్.. అంటూ నినాదాలతో హోరెత్తించారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్నదని మండిపడ్డారు.



బెల్లంపల్లి : మౌనం పాటిస్తున్న గంగపుత్ర సంఘం నాయకులు

# నాటి జ్ఞాపకాలు 'పది'లం

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు

దండేపల్లి, మే11 : ద్వారకలోని జేవీఎన్‌ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1999-2000 బ్యాచ్ కు చెందిన పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం నిర్వహించారు. 25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరేసుకొని ఉత్సాహంగా గడిపారు. ఊరికోసం, పాఠశాల అభివృద్ధి కోసం సహకరిస్తామని తెలిపారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించారు.

## సబ్బెపల్లిలో..

హాజీపూర్, మే 11 : సబ్బెపల్లి జడ్పీ పాఠశాలలో 2005-06 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఉపాధ్యాయులు కమటం రామకృష్ణ, మధుసూదన్, అంజన్న, రవీందర్, లచ్చన్న, ఎల్లయ్యతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## జన్నారంలో..

జన్నారం, మే 11 : ద్వారక భారతి పాఠశాలలో 2007-08లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. తీపి గుర్తులను నెమరేసుకొని సంతోషంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.



జన్నారంలోని ద్వారక భారతి పాఠశాలలో పూర్వ విద్యార్థులు



జేవీఎన్‌ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు



సబ్బెపల్లి జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు